ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

శనివారం 8 నవంబరు 2025



వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి



◄ ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
- 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు.. 161 మందికి బంగారు పతకాలు

7



శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హెచ్‌సీయూ వీసీ బీజే రావు, ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్

శాతవాహన విశ్వవిద్యాలయ ద్వితీయ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు, 161 మందికి బంగారు పతకాలు అందజేశారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసం విద్యార్థి విజయానికి దోహద పడుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలన్నారు. - కరీంనగర్ టౌన్, ఆంధ్రజ్యోతి

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు

- అదనపు కలెక్టర్ బీఎస్ లత

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

-ఎస్పీ అశోక్‌కుమార్ 8

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, పిరండ్ల సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. దీంతో ఆయా సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఆయా గ్రామాలైన పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, హన్మాజీపేట, పొలాస, గుల్లపేట, అనంతారం, రొడ్డాం, అగ్రికల్చర్ కాలేజ్, ఎక్స్‌ప్రెస్ ఫ్రీడర్, హైదరాపల్లి గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

●కొడిమ్యాల: కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆర్ రఘునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొడిమ్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

●మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్‌కు నూతనంగా మంజూరైన అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలో నెల వారి మరమ్మత్తుల దృష్ట్యా మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, మల్యాల క్రాస్ రోడ్డు గ్రామాలకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పుస్తె మట్టెలు అందజేత

కొడిమ్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు చల్ల రాజిరెడ్డి అంజలి కుమార్తె సింధూజ వివాహానికి కరీంనగర్ డెయిరీ వారు పుస్తె మట్టెలను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో పాల డెయిరీ సంఘం అధ్యక్షుడు పింగలి మనోహర్‌రెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి మాజీ ఉపసర్పంచు చల్ల శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ నవీన్, పాడి రైతులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్యం



- రేషన్‌బియ్యంలో పోషకాలు
- ఆహారంగా తీసుకుంటే పెరగనున్న రోగనిరోధక శక్తి
- రక్తహీనత అధిగమించవచ్చని వైద్యుల సూచన

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ రెండేళ్లుగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తోంది. అవగాహన లేక కొందరు లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ రేషన్ సన్న బియ్యాన్ని నల్ల బజారులో విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో



జిల్లాలో రేషన్ వివరాలు ఇలా..

రేషన్ దుకాణాల సంఖ్య	592
ఆహార భద్రతాకార్డుల సంఖ్య	2,17,665
యూనిట్ల సంఖ్య...	6,16,557
ఏఎఫ్‌సీ కార్డుల సంఖ్య....	14,587
యూనిట్ల సంఖ్య...	35,667
అన్నపూర్ణ కార్డుల సంఖ్య...	125
యూనిట్ల సంఖ్య...	144
మొత్తం కార్డుల సంఖ్య...	3,47,546
యూనిట్ల సంఖ్య...	10,13,901

ఆహార భద్రత నుంచి పోషకాహార భద్రత కల్పించాలన్న ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లాలోని రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ ప్రారంభించింది. అయితే ఇందులో ప్రతి నెలా 5 నుంచి 10 శాతం రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. జాతీయ పోషకాహార సంస్థ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.

అపోహలు వద్దు..

చిన్నారులు, యువకులు, గర్భిణుల్లో 35 నుంచి 50 శాతం రక్తహీనత ఉన్నట్లు జాతీయ కుటుంబ సర్వే నివేదిక పేర్కొంది. ఎలాంటి అపోహలు లేకుండా ఫోర్టిఫైడ్ రైస్‌ను ఆహారంగా తీసుకుంటే ఈ సమస్యను అధిగమించొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మహిళలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పురుషులు తీసుకునే మొత్తం మిగతా 8లో..

రేషన్‌బియ్యాన్ని వినియోగించాలి

జితేందర్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి



రేషన్ దుకాణాల్లో పంపిణీ జరుగుతున్న ఫోర్టిఫైడ్ కెర్నెల్స్ బియ్యాన్ని లబ్ధిదారులు ఆహారంగా తీసుకోవాలి. దుకాణాల్లో తీసుకున్న బియ్యాన్ని ఇతరులకు విక్రయించకుండా ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతంగా ఉంటారు. రక్తహీనతను అధిగమించవచ్చు. చిన్న పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రేషన్‌బియ్యాన్ని వినియోగించాలి.

'ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు పోరాటం'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తి ప్రజలకు చెందేందుకు ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. ఒకవేళ రాజకీయాలకు అతీతంగా జేఏసీ ఏర్పాటు చేస్తే అందులో భాగస్వాములై, మున్సిపల్ భూమి పరిరక్షణలో తమ వంతు భాగస్వాములవుతామని ఆమె అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జగిత్యాలలో కిబాల అంశం హల్‌చల్ చేస్తోందన్నారు. తాను మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న సమయంలో పెట్రోల్ పంప్ భూకబ్జా విషయంలో మాట్లాడినందుకు తనను టార్గెట్ చేశారన్నారు. ఒక దశలో చైర్‌పర్సన్‌గా తన రాజీనామాకు ఈ పెట్రోల్ బంక్ వ్యవహారం కూడా ఒక కారణం అన్నారు. రోడ్డు విస్తరణకై తొలిప్రయత్నంగా మాస్టర్‌ప్లాన్ ప్రకారం డివైడర్ కడుతున్న సందర్భంలో ఐదు ఫీట్లు ఆర్ అండ్ బీ ఆఫీస్ దిక్కు అలైన్‌మెంట్ చేయించారని పేర్కొన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం డివైడర్ కడితే పెట్రోల్ బంకు విషయం బయటకు వస్తుందని తనపై ఒత్తిడి తీసుకువచ్చారన్నారు. కబ్జాలకు పాల్పడిన వారిని కాపాడేందుకు అప్పుడున్న ఎమ్మెల్యే తనను నడిరోడ్డుపై నిలబెట్టి, తనను తల దూర్చవద్దని ఒత్తిడి తెచ్చారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా, పట్టణ వివిధ హోదాల బాధ్యులు నలువాల తిరుపతి, కొక్కు గంగాధర్, మ్యాదరి అశోక్, బొడ్డు పెద్ద గంగారాం తదితరులున్నారు.

కుక్కల బెడదను నివారించాలని రాస్తారోకో

రాయికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో వీధి కుక్కల బెడదను నివారించాలని కోరుతూ బీజేపీ నాయకులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కుక్కలు వేల సంఖ్యలో పెరగడం వలన పాదచారులు ముఖ్యంగా చిన్న పిల్లలను ఇటీవల పట్టణంలోని వివిధ వార్డులలో 35 మందికి పైగా కుక్క కాటుకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కల వలన ప్రజలకు ప్రాణభయం ఉందని పేర్కొన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులకు విన్నవించినా స్పందన లేదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు కునారపు భూమేష్, బన్న సంజీవ్, ఉపాధ్యక్షుడు ఎల్లాగౌడ్, అల్లె నర్సయ్య, బీజేపీ నాయకులు కల్లెడ ధర్మపురి, సామల్ల సతీష్, బొడుగం శ్రీకాంత్, దాసరి రవి, అందె శంకర్, బూర్ల గోపి, శ్రీగద్దె సుమన్, మచ్చ శంకర్, మచ్చ గంగరాజం, వాసం నర్సయ్య, మామిడాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

-అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంజూరు అయిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖాధికారి రాముతో కలిసి వివిధ రంగాల ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు, ఆదర్శ పాఠశాలల సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాఠశాలలకు మంజూరు అయిన పనులు వేగవంతంగా పూర్తయ్యేలా దృష్టి సారించాలన్నారు.

'కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌లు'



మాట్లాడుతున్న న్యాయమూర్తి పావని

కోరుట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేసుల సత్వర పరిష్కారం కోసం న్యాయ శాఖ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పావని అన్నారు. శుక్రవారం కోర్టు భవనంలో బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి లోక్ అదాలత్‌లో పరిష్కారం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను న్యాయవాదులకు వివరించారు. ఈనెల 15న నిర్వహించే లోక్ అదాలత్ విజయవంతానికి బార్ అసోసియేషన్ సభ్యులు సహకారం అందించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను మీడియేషన్ ద్వారా సిఫారసు చేసి పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ కోరుట్ల మీడియేటర్లుగా కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్, సభ్యులు సత్యార్థ ప్రకాష్, మచ్చరమణ మూర్తి, చింత సూర్యనారాయణ, ప్రసాద్, చాప వందనలను హైకోర్టు నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

జగిత్యాల టౌన్, 7 నవంబర్ ఆంధ్రజ్యోతి) : లీడ్ ఇండియా ఫౌండేషన్ విశ్వగురు భరత్ 2047 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు లీడ్ ఇండియా శిక్షణ సమన్వయ కర్తతాడూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాలలోని సరస్వతి శిశుమందిర్ ఆవరణలో ఈనెల 9న సమయం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.

లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణలో ఆసక్తి ఉన్న వారికి ఈ నెల 10, 11, 12 తేదీలలో హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలో సెలెక్ట్ అయిన వారికి భోజన వసతితో పాటు గౌరవ వేతనం లభించనుంది. వీరు రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థిలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని లీడ్ ఇండియా ఫౌండేషన్ సమన్వయ కర్త శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆసక్తి కలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అథ్లెటిక్ పోటీలకు అంతర్గాం విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య

జగిత్యాలరూరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలస్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సువాంకి, ఎస్‌కె రబియాలు జిలాస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైనట్లు పీఇటీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఈసందర్భంగా జిలాస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

'వందేమాతరం' దేశభక్తి స్ఫూర్తికి నిదర్శనం





వందేమాతరం గీతం ఆలపిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజాగౌడ్, అధికారులు

జగిత్యాల టౌన్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం దేశభక్తి స్ఫూర్తికి నిదర్శనమని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జాతీయ గేయం వందేమాతరానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు సామూహిక వందే మాతర గేయాలాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వందేమాతరం మన స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన శక్తివంతమైన గేయమని అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్ అలీఖాన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు సైదులు, వేణు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

●కలెక్టరేట్‌లో వందే మాతరం గేయంను సామూహిక గీతాలాపన కార్యక్రమాన్ని శుక్రవారం అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజాగౌడ్, అధికారులు వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో హకీం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవాలు



కళా ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

జగిత్యాల టౌన్/అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మీని స్టేడియంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా యువజన ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో పోటీలు నిర్వహించగా 350 మంది యువతీ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జిల్లా గ్రామీణా అభివృద్ధి అధికారి రఘువరణ్ చేతుల మీదుగా బహుమతులతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామునాయక్, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, జిల్లా పేటా అధ్యక్షులు పడాల విశ్వప్రసాద్, చిట్టిపల్లి సుధాకర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, యువజన సంఘాల నాయకులు బొడ్డు రాజేష్, విజయ్, విక్రమ్‌రెడ్డి, కోటా మధుసూదన్ పాల్గొన్నారు.

గురుకులం విద్యార్థుల ప్రతిభ

మల్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలలో మండలంలోని తాటిపల్లి బాలికల గురుకులం విద్యార్థులు ప్రతిభ చాటారు. గ్రూప్ డ్యాన్స్‌లో హారిక, రసజ్ఞ, చరని, అమూల్య, ప్రణవి, రమ్య, ప్రణవి, లక్ష్య, సంధ్య, అలేఖ్య, అరుంధతి, కవిత్వంలో మేఘన, కథలు రాయడంలో మేఘన ప్రతిభ చాటి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జనవరిలో జరిగే రాష్ట్ర స్థాయి గ్రూప్ డ్యాన్స్ పోటీలలో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మానస తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

గన్నేరువరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు వెంబడి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఇండియన్ బ్యాంకు ముందు నుంచి నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళతో మండల కేంద్రానికి చెందిన మునిగంటి అజయ్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధిత మహిళ వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ఆధారంగా వ్యక్తిని కనుగొని శుక్రవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీ కొట్టిన లారీ..

● క్లీనర్‌కు స్వల్ప గాయాలు

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెట్టును లారీ ఢీకొట్టగా, క్లీనర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. పల్లీల లోడ్‌తో అహ్మదాబాద్ నుంచి వరంగల్‌వైపు లారీ వెళ్తోంది. ఈ క్రమంలో హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వజూనియర్ కళాశాల ఎదుట మూలమలుపు వద్ద ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టింది. దీంతో క్లీనర్‌కు స్వల్పగాయాలు కాగా, ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైతు నేస్తం.. శాస్త్రవేత్తలతో అనుసంధానం



రైతు నేస్తంలో పాల్గొన్న రైతులు

ఆధునిక సాగుపై అన్నదాతలకు అవగాహన

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం... రైతులతో శాస్త్రవేత్తలను అనుసంధానించే కార్యక్రమం. సాగులో ఆధునిక విధానాలు, పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించడమే లక్ష్యంగా వ్యవసాయశాఖ చేపట్టిన ఈ కార్యక్రమం రైతులకు చేరువవుతోంది. రెవెన్యూ గ్రామాల్లోని రైతు వేదికల్లో ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులనుంచి రైతులు నేరుగా సలహాలను పొందవచ్చు. మండలంలోని చొప్పదండి, ఆర్నకొండ, గుమ్లాపూర్ రైతు వేదికల్లో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతు వేదికల్లో మండల వ్యవసాయ అధికారి, విస్తరణ అధికారులు హాజరవుతున్నారు. రైతులకు ఒక రోజు ముందే సమాచారాన్ని అందిస్తారు. వీడియో కాన్ఫరెన్సులో అందుబాటులో ఉండే శాస్త్రవేత్తలు, పంటల సాగు, నూతన పంటలపై అవగాహన కల్పిస్తామని రైతులకు సమాచారాన్ని చేరవేస్తారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు వేదికల వద్దకు వెళ్లి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని పంటల తెగుళ్లు, ఎదుర్కొంటున్న వ్యాధుల గురించి శాస్త్ర వేత్తలతో మాట్లాడి పరిష్కారం పొందవచ్చు.



వ్యవసాయ అనుబంధ శాఖలు అందుబాటులోకి...

ప్రతి వారం నిర్వహించే కాన్ఫరెన్సులో వ్యవసాయంతోపాటు ఉద్యానవన, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ, నీటి పారుదలశాఖకు సంబంధించిన అధికారులు, శాస్త్రవేత్తలు అందు బాటులో ఉంటారు. సాగులో అధిక దిగు బడులు పొందేందుకు అవసరమైన సూచనలు, సలహాలు రైతులు పొందవచ్చు. నూతన సాగు విధానాలు, ఆధునిక పద్ధతులు, పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, తెగుళ్ల వ్యాప్తిని అరికట్టేందుకు నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తారు. ఇప్పటికే వ్యవసాయశాఖ రైతుల కోసం వాట్సాప్ ఛానల్‌ను అందుబాటులోకి తీసుకురాగా రైతు ముంగిటకు శాస్త్ర సాంకేతిక రంగాలు చేరాయి.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి... వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి



ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రైతులు రైతు వేదికలకు వచ్చి శాస్త్రవేత్తలు, అధికా రుల దృష్టికి సాగు సమస్యలు తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవచ్చు. ఉద్యానవనశాఖ శాస్త్రవేత్తలు కూడా అందుబాటులో ఉంటారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రాజశేఖర్(ఫైల్)

కోరుట్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన పుల్లవేణి రాజశేఖర్(35) అనే యువకుడు అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్లవేణి రాజశేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడసరైన ఉద్యోగం దొరక్క పోవడంతో సంవత్సరం క్రితం స్వగ్రామమైన అయిలాపూర్‌కు తిరిగివచ్చి చికెన్ బిర్యాని సెంటర్ నడుపుతున్నాడు. అదిసరిగా నడవక పోవడంతో మద్యానికి బానిసై రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం సమయంలో గ్రామశివారులోని మల్లన్న గుట్ట సమీపంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. రైతులు పోలీసులతో పాటు బంధువులకు సమాచారం అందించడంతో పోస్టుమార్టం నిమిత్తం కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. రాజశేఖర్ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజశేఖర్‌కు భార్య సంధ్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నాడు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి



సిద్ధార్థ(ఫైల్)

ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ గ్రామశివారులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోపడి పల్లికొండ సిద్ధార్థ (18) అనేయువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మామడ మండలం పోస్కల్ గ్రామానికిచెందిన సిద్ధార్థ ఈనెల6న చేపలు పట్టడానికి మూలరాంపూర్ గ్రామశివారులోని సదర్‌మట్ ప్రాజెక్టుగేట్ నెంబర్ 52 వద్దకు వెళ్లాడు. అక్కడ సిద్ధార్థ వలతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు ముందుకు పడి తలకు బలమైగాయమై నీటిలో పడి చనిపోయాడు. మృతుడు తండ్రి గంగన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

కోనరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు బంగారు పుస్తెలు, ఒక బంగారు ముక్కుపోగు, 4 వెండిమట్టెలు అపహరించారు. గుడిలో పనిచేసే వంకాయల లక్ష్మీరాజం సాయంత్రం గుడికి వెళ్లి చూసేసరికి గుడికి వేసిన తాళం లేదు. లోపలకి వెళ్లి ఆభరణాలు కనిపించలేదు. ముదిరాజ్ సంఘం నాయకుడు తుమ్మల బాబు ఫిర్యాదుతో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

నిప్పంటించుకుని వివాహిత ఆత్మహత్యాయత్నం

● కాపాడి ఆసుపత్రికి తరలించిన పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు



స్వప్నను ఆసుపత్రికి తరలిస్తున్న సీఐ, పోలీసులు, మెడికల్ కళాశాల విద్యార్థులు



స్వప్న(ఫైల్)

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మెడికల్ కళాశాల రహదారి పక్కన, ఆర్‌టీసీ డిపో వెనుక శుక్రవారం రాత్రి సల్ల స్వప్న(35) అనేవివాహిత ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. మంటల్లో కాలుతున్న ఆమె ప్రాణభయంతో అరవడంతో అటుగా వెళుతున్న మెడికల్ విద్యార్థులు, యువకులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, వైద్యకళాశాల విద్యార్థులు చెట్ల పొదల్లో తీవ్రగాయాలతో పడిఉన్న స్వప్నను రక్షించి ఆటోలో గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమెపరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు పేర్కొన్నారు. ఆమె సూసైడ్ లెటర్ రాసి బ్యాగులో పెట్టుకుంది. నా చావుకు ఎవరూ కారణం కాదని, రెండు నెలలుగా డిప్రెషన్‌లో ఉన్నానని, ఏ పనిచేయలేకపోతున్నానని, అనారోగ్యంతో బాధపడుతున్నా నని, భయం భయంగా ఉందని, నామీద నాకు నమ్మకం లేదంటూ పేర్కొన్నది. ఫైటింక్లయిన్‌కాలనీ సమీపంలోని పోతనకాలనీలో సల్ల స్వప్న కుటుంబం నివాసముంటున్నారు. ఆమెభర్త సతీష్ దగ్గరలోని జూలపల్లి ఆదర్శనగర్‌లో కిరాణాషాపు నడుపుకుంటున్నాడు. ఇద్దరు పిల్లలు. మానసి కస్థితి సరిగా లేక రెండురోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. స్వప్నను రక్షించి ఆసుపత్రికి తరలించిన సీఐ ఇంద్రసేనారెడ్డి, మెడికల్ కళాశాల విద్యార్థులను పలువురు అభినందించారు.

విషాహారం తిని 36 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ధర్మారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెర్కపల్లిలో విషాహారం తిని 36గొర్రెలు మృతిచెందగా 200 గొర్రెల వరకు అస్వస్థతకు గురయ్యాయి. పెర్కపల్లి గ్రామానికి చెందిన ఐదుగురు గొర్రెల కాపరులు బుధవారం గ్రామంలో కోసిన పంట పొలాల్లో గొర్రెలు మేపేందుకు వెళ్లారు. మందలో రెండు వందలకు పైగా గొర్రెలు ఉండగా కొన్ని సాయంత్రం వరకు అస్వస్థతకు గురయ్యాయి. దీంతో కాపరులు సొంత వైద్యంతో పాటు వెటర్నరీ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి వాడినట్లు సమాచారం. అప్పటికే మందలోని కొన్ని గొర్రెలు తీవ్రఅస్వస్థతకు గురై గురువారం సాయంత్రం మరణించగా, శుక్రవారం ఉదయం మరికొన్ని మరణించాయి. దీంతో ఆందోళనకు గురైన యాదవులు మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. స్పందించిన మంత్రి జిల్లా పశువైద్యాధికారి విజయ్ భాస్కర్‌కు ఫోన్‌ద్వారా పరిస్థితిని వివరించి అత్యవసర చికిత్స అందించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో గ్రామానికి చేరుకొని చనిపోయిన 36 గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం రెండు వందల గొర్రెలకు చికిత్స అందించారు. పోస్టుమార్టంలో కొన్నిగొర్రెలు వడ్లు తిని చనిపోగా మరికొన్ని విషాహారాన్ని తిని మృతిచెందినట్లు పశువైద్య అధికారులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. నమూనాలను కరీంనగర్‌కు పంపగా అక్కడి నుంచి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు వైద్యులు తెలిపారు. వారంలో రిపోర్టులు వస్తాయని అప్పటివరకు మృతికి గల కారణాలు స్పష్టంగా చెప్పలేమని మండల వైద్యాధికారి అజయ్ తెలిపారు.

మంత్రి ఆదేశాలతో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు సోగాల తిరుపతి, బుట్టి సాగర్ , ఓరెం చిరంజీవి యాదవ సంఘం అధ్యక్షుడు అప్పాల శ్రీను మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు.

సేల్‌డీడ్‌కు రిజిస్ట్రార్ నిరాకరణ

● ఆందోళన వ్యక్తం చేసిన దంపతులు



నిరాకరించిన డాక్యుమెంటుతో తోట శ్రీకాంత్ దంపతులు

గంగాధర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకే అపార్ట్‌మెంటులో బ్యాంకు మార్టిగేజ్ రిజిస్ట్రేషన్ చేసి అదే అపార్టుమెంటులో మరొకటి సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారిని నిరాకరిస్తూ, చేయ రాదంటూ రిజిస్ట్రార్ వెనక్కిపంపించారు. కరీంనగర్ పట్టణ కేంద్రం మారుతీ నగర్‌కు చెందిన తోట శ్రీకాంత్ రేకుర్తి గ్రామంలోని సర్వే నంబరు 80, లేపాక్షి పరివార్ అపార్ట్‌మెంట్‌లో ప్లాట్‌నెంబరు 304కొనుగోలు చేశాడు. అక్టోబరు 18న సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ కోసం గంగాధర సబ్‌రిజిస్ట్రార్‌కు డాక్యుమెంటు సమర్పించాడు. అయితే శ్రీకాంత్ డాక్యుమెంటును ఈనెల4న డీటీఈపీ నిబంధనలు, జిల్లాకలెక్టర్ చింతకుంట గ్రామానికి సంబంధించిన ఉత్తర్వులను కారణం చూపుతూ నిరాకరించారు. కానీ అదేసబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంతకు ముందు అదే అపార్ట్‌మెంటు, అదేసర్వే నంబర్ సంబంధించిన మార్టిగేజ్(బ్యాంకు టైటిల్ డీడ్ డిపాజిట్) లావాదేవీలను రిజిస్టర్ చేశారని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆ ఆస్తిపై ఎటువంటి నిషేధ ఉత్తర్వులు లేవని, చట్టబద్ధమైన బదిలీని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ ఉత్తర్వులు నిజంగా నిషేదిస్తున్నాయంటే అదేఆస్తికి బ్యాంకు మార్టిగేజ్ ఎలా అంగీకరించబడింది, సేల్‌డీడ్‌కు నిరాకరిస్తూ మార్టిగేజ్ రిజిస్ట్రేషన్లను అనుమతించడం ఎలా సాధ్యమని శ్రీకాంత్ పేర్కొన్నారు. రేకుర్తి గ్రామంలోని లేపాక్షి పరివార్ ఎటువంటి నిషేది జాబితాలో లేదని అటువంటి పరిస్థితిలో తన ప్లాటును నిరాకరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణ హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులను ఉదహరిస్తూ చట్టపరమైన నిషేద ఉత్తర్వులు లేకుండా రిజిస్ట్రేషన్లను నిరాకరించడం రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్71,72లకు వ్యతిరేకమని ఆయన అన్నారు. దీనిపై జిల్లా రిజిస్ట్రార్ వద్ద అప్పీల్‌కు దాఖలు చేస్తామని తెలిపారు.

రుణం చెల్లించాలని ఇంటికి తాళం

● రోడ్డున పడ్డ వృద్ధ దంపతులు



రోదిస్తున్న వృద్ధ దంపతులు

వేములవాడ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటిపై తీసుకున్న రుణం తాలూకు బకాయిలు చెల్లించడం లేదని ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ వారు ఇంటికి తాళం వేయడంతో ఆ ఇంటినే నమ్ముకుని జీవిస్తున్న వృద్ధ దంపతులు రోడ్డున పడ్డారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మల్లారం గ్రామానికి చెందిన మల్లారం రాజయ్య, పోశవ్వకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడైన మల్లారం శ్రీనివాస్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో ఇంటిని తాకట్టు పెట్టి రూ.14లక్షల రుణం తీసుకున్నాడు. సంవత్సరకాలంగా ఎలాంటి వాయిదాలు చెల్లించలేదు. తీసుకున్న బకాయిలు చెల్లించాలని సంస్థ వారు పంపిన నోటీసులకు సమాధానం లేకపోవడంతో సదరు సంస్థ వారు కోర్టును ఆశ్రయించారు. రెండు రోజుల క్రితం ఇంటి సామాను బయటవేసి ఇంటికి తాళంవేశారు. తాము నివాసముం టున్న ఇంటికి తాళం వేయడంతో దిక్కుతోచని స్థితిలోఉన్న రాజయ్య పోశవ్వలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. చిన్నకుమారుడు శ్రీనివాస్ ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందం చకపోవడంతో ఇంటిపరిసరప్రాంతాలలో తలదాచుకుంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న రాజయ్య పోశవ్వ దంపతుల పరిస్థితి స్థానికులను కలిచివేస్తోంది.

ఎక్సైజ్ అధికారుల దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, లక్ష్మీపూర్, లింగన్నపేట, ముచ్చర్ల గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, ఇద్దరు అనుమానితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా లింగాపూర్ తండాలో బైండోవర్ ఉల్లంఘన కింద ఒకరికి జరిమానా విధించినట్టు వెల్లడించారు.

పొలంలో కొండచిలువ

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్‌లో పొలంలో కొండచిలువ కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్‌లో ఓ రైతు తనపొలంలో హార్వెస్టర్‌తో వరికోయిస్తున్నాడు. ఈక్రమంలో కొండచిలువ హార్వెస్టర్ బ్లేడుకు తగిలి డ్రైవర్‌కు కనిపించింది. డ్రైవర్, సమీప రైతులు పొలం నుంచి కొండచిలువను బయటకు తీసుకువచ్చేసరికి మృతిచెందినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వెన్నంపల్లి విద్యార్థులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

సైదాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూప్ 2025లో రాష్ట్రస్థాయిలో ప్రథమబహుమతి పొంది జాతీయస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోద్యాయుడు రాయి రెడ్డి ప్రభాక ర్‌రెడ్డి తెలిపారు. డోలువాయిద్యం పోటీలలో అమరగొండ రోహిత, అమరగొండ అశ్వర్, వెంగల ఆశీష్‌వర్ధన్ చిగుర్ల రిత్విక్‌లు హైదారాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో అత్యంత ప్రతిభ కనపరిచి పుణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యార న్నారు. ఎంపికైన విద్యార్థులకు, వారికి తర్ఫీదు ఇచ్చిన పీడీ జ్యోతికి ప్రధానోపాధ్యాయుడు రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు శుభా కాంక్షలు తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం ధాన్యం లోడుతో వెళుతున్న లారీ తగిలి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. కరెంటు సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రమాదం తృటిలో తప్పినట్లయింది. ధాన్యం లోడుతో బయలుదేరిన లారీ కరెంటు తీగలు అడ్డుగా ఉండడంతో గమనించని డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపించాడు. దాంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. సమాచారం అందుకున్న 'సెస్' సిబ్బంది మరమ్మతు చేపట్టారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

బోయినపల్లి నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పట్టుకున్నట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. రేకుర్తిగ్రామానికి చెందిన కోట పొచయ్య, బోయినపల్లి మండలకేంద్రానికి చెందిన నల్లగొండ రాకేష్ రేషన్ కార్డుదారుల వద్ద నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలుచేసి విక్రయిస్తున్నట్లు తెలిపారు. సుమారు 4క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, ఎక్స్‌ఎల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ పీడీఎస్ బియ్యం రవాణా లేదా అమ్మకానికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇల్లంతకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లంపట్ల గ్రామ సమీపంలోని ముస్కుపల్లి వాగు నుంచి ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడిచేసి పట్టుకొని డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రౌడీ షీటర్లు పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలో రౌడీషీటర్లు ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం వన్‌టౌన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎవరైనా నేరాలను ప్రోత్సహించినా, గొడవలు, దాడులు, బెదిరింపులకు దిగినా కఠినచర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని, వారిపై నిఘా ఉంటుందన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీయాక్టు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్..

మంథని: పోలీసు సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సర్కిల్ కార్యాలయంలో సీఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరిపై నిఘా ఉందన్నారు. ప్రవర్తనలో మార్పు రావాలన్నారు. ఎస్ఐ రమేష్ ఉన్నారు.

బాల్య వివాహాలను అడ్డుకున్న అధికారులు

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు బాల్య వివాహాలను సంబంధిత అధికారులు అడ్డుకున్నారు. శుక్రవారం మండలంలోని ఓ గ్రామంలో రెండు వేర్వేరుచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయనే సమాచారంతో జిల్లా కేంద్రానికి చెందిన అధికారులు పోలీసుల సహకారంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకచోట పెళ్లికి సిద్ధంగా ఉన్న జంట పారిపోయారు. మరోచోట అధికారులు వెళ్లేసరికే పెళ్లి జరిగిపోయింది. అయితే పెళ్లిజరిగిన జంటకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి విచారణ జరుపుతున్నారు. పారిపోయిన జంటను శనివారం తమ ఎదుట హాజరు పరచాలని ఇరువురి తల్లిదండ్రులను ఆదేశించారు.

రాజన్న సన్నిధిలో భక్తుల సందడి



కార్తీక దీపాలు వెలిగిస్తున్న సుహాసినులు

వేములవాడ టౌన్, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తజనసందడి నెలకొంది. శుక్రవారం వేలాది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్న సన్నిధిలో భక్తులు స్వామివారిని లఘుదర్శనం చేసుకున్నారు. శ్రీభీమేశ్వరాలయంలో కోడెమొక్కులు చెల్లించి అర్జిత సేవలైన కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, కుంకుమపూజలు, అభిషేకాలు, అన్న పూజలు, మహాలింగార్చనలు, పల్లకి సేవలు, ఆకుల పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరస్వామివారి కళ్యాణ మండపంలో కార్తీక పురాణ ప్రవచనం నిర్వహించారు.

భీమన్న సన్నిధిలో కార్తీక దీపోత్సవం

రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన భీమేశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా కార్తీకదీపోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి సుహాసినిలచే కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకెళ్లాలి



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కుమార్

- యూనివర్సిటీకి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ కోసం శ్రద్ధ తీసుకోవాలి
- విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలి
- 'శాతవాహన' ద్వితీయ స్నాతకోత్సవంలో ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- 25 మందికి పీహెచ్‌డీ పట్టాలు... 161 మందికి బంగారు పతకాలు



ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

కరీంనగర్ టౌన్/గణేష్‌నగర్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులు ఆధునిక, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని వికసిత్ భారత్ లక్ష్యంగా ముందు కెళ్లాలి' అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ ద్వితీయ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్, ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్‌వర్మ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయపథం దిశగా తీసుకెళుతుందన్నారు. విద్యార్థుల మేథాశక్తే వారి ప్రయోగశాల అని అభివర్ణించారు.

విద్యార్థుల నూతన ఆవిష్కరణలు, ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యారంగం సాంకేతికతతో ముందుకు సాగుతోందని, బోర్డు, చాక్‌పీస్‌లకే పరిమితం కావద్దని అన్నారు. డిజిటల్ లర్నింగ్, భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని చెప్పారు. నైపుణ్యం, నిరంతర అభ్యాసాలు విద్యార్థి విజయానికి దోహద పడతాయని తెలిపారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని గవర్నర్ అన్నారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని, భయాన్ని, అలసటను అధిగమించి ముందుకు సాగాలన్నారు. కృషితో ప్రతి విద్యార్థి అభివృద్ధి సాధ్యమేనన్నారు. విద్యార్థి దశ నుంచే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

'శాతవాహన' ప్రస్థానం స్ఫూర్తిదాయకం

ప్రొఫెసర్ బీజే రావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ

ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ బీజే రావు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయ ప్రస్థానం స్ఫూర్తిదాయకమన్నారు. రెండు దశాబ్దాల కంటే తక్కువ వ్యవధిలో ఈ సంస్థ తెలంగాణాలోని ఉత్తర ప్రాంతంలో అభ్యాసానికి, ఉన్నత విద్యకు కీలకమైన కేంద్రంగా మారిందని అన్నారు. ఆరు సంవత్సరాల్లో విశ్వ విద్యాలయంలో 1,03,454 మంది అండర్ గ్రాడ్యుయేట్లలో 55,000 మందికి పైగా విద్యార్థులు పట్ట భద్రులయ్యారని, 34,561 మందిలో 25,310 మంది పీజీ డిగ్రీలను సొంతం చేసుకున్నారన్నారు.



కొత్త కోర్సులు ప్రవేశ పెడుతున్నాం

ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్, 'శాతవాహన' వీసీ

శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ యు ఉమేశ్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా 156 కళాశాలలు యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులను అందిస్తున్నాయన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. ఎం ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీటెక్ కోర్సులు ప్రారంభించామని చెప్పారు. వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత బయోమెట్రిక్ హాజరు అమలు చేశామని, విద్యార్థుల భద్రత కోసం 100 కెమెరాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, కలెక్టర్ పమేలా సత్పతి, పోలీసు కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.



- ఈ సందర్భంగా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసిన 25 మందికి డాక్టరేట్ పట్టాలను, 2018 నుంచి 2023 వరకు వివిధ సబ్జెక్టుల్లో ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలను గవర్నర్ అందజేశారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం... పోలీసు గౌరవ వందనం

కరీంనగర్‌కు చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు అధికారులు ఘనస్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు రావలసిన గవర్నర్ 15 నిమిషాల ముందే యూనివర్సిటీకి చేరుకున్నారు. పరిపాలన విభాగం భవనం ముందు పోలీసులు ఆయనకు గౌరవవందనం సమర్పించగా, వీసీ ఉమేశ్‌కుమార్, రిజిస్ట్రార్, అధ్యాపకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.





హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అధికారులు, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యం..: నర్మద



నేను అగ్రహారం డిగ్రీ కళాశాలలో చదివాను. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించాను. నన్ను ప్రోత్సహించిన తెలుగు హెచ్‌వోడీ లక్ష్మీనారాయణ సార్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చు. నాలుగు బంగారు పతకాలు అందుకోవడం సంతోషాన్నిచ్చింది.

ఇదే స్ఫూర్తితో ముందుకుసాగుతా.. : అమరనంద



మాది ధర్మారం రాజారాంపల్లి. తెలుగు డిపార్ట్‌మెంట్‌లో నాలుగు గోల్డ్ మెడల్స్ గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం ఆనందాన్నిచ్చింది. ఈ గోల్డ్ మెడల్స్ సాధించడానికి ప్రోత్సాహం ఇచ్చిన తెలుగు డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు లక్ష్మీనారాయణకు రుణపడి ఉంటాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత చదువులు కొనసాగిస్తాను.

అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతో.. కామినేని సాయిచరిత్ర



నేను వివేకానంద డిగ్రీ, పీజీ, కళాశాలలో ఎంబీఏ హెచ్‌ఆర్ చదువుకున్న. రెండు గోల్డ్ మెడల్స్ సాధించా. మా అధ్యాపకులు, కుటుంబ సభ్యుల సహకారంతోనే ఇది సాధ్యమైంది.

నా కష్టానికి ఫలితం దక్కింది..: వసీమా



నేను ఎంబీఏ ఫైనాన్స్ చదువుకున్న. నాకు చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదవడం అలవాటు. అలా చదవడం వల్ల ఈ రోజు బంగారు పతకం సాధించా. చాలా సంతోషంగా ఉంది. నా కష్టానికి ఫలితం దక్కింది.

రెండు బంగారు పతకాలు సాధించాను: బూర నవీన్



మాది వేములవాడ మండలం మారుపాక. ఎంఏ సోషియాలజీ విభాగంలో రెండు బంగారు పతకాలు సాధించాను. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు అభినందనలతో ముంచెత్తారు.

సంతోషంగా ఉంది.. కాల్వ వెంకటేశ్



ఎంబీఏ మార్కెటింగ్ 2017-19 సంవత్సరంలో చదువుకున్నా. నేను పేద కుటుంబం నుంచి వచ్చాను. రూరల్ బ్యాక్ గ్రౌండ్ అయినా కష్టపడి చదివి నేను అనుకున్నది సాధించాను. దీనికి మా తల్లిదండ్రులు, అధ్యాపకులే ప్రధాన కారకులు. గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకోవడం ఆనందంగా ఉంది.

తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు: కొండ ప్రవళిక



మాది రాయికల్ మండలం మూటపల్లి గ్రామం. శాతవాహన యూనివర్సిటీలో 2019లో ఎంఏ తెలుగు పూర్తి చేశాను. ప్రాచీన సాహిత్యంలో నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. ఇందుకు సహకరించిన గురువులకి, తల్లిదండ్రులకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రోత్సాహాన్నిచ్చింది.. తౌటం సునీల్



రంగాపూర్ గ్రామానికి చెందిన నేను అర్థశాస్త్రంలో బంగారు పతకం సాధించాను. పతకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. నా కష్టానికి తగ్గ ఫలితం దక్కింది. నా భవిష్యత్తుకు ప్రోత్సాహాన్నిచ్చింది.

అమ్మ నాన్నల చేతుల మీదుగా అందుకుంటే బాగుండేది.. : మోదెం క్రాంతికుమార్



ఖమ్మం జిల్లాకి చెందిన నేను ఎంఏ సోషియాలజీ విభాగంలో బంగారు పతకాన్ని సాధించాను. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉంది. అమ్మనాన్నల చేతుల మీదుగా అందుకుంటే మరింత సంతోషంగా ఉండేది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..: స్పందన



కెమిస్ట్రీ విభాగంలో నాకు బంగారు పతకం రావడానికి మా తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతగానో ఉపయోగపడింది. వారికి, శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ప్రస్తుతం టీచింగ్ ఫీల్డ్‌లో ఉన్నాను. ఇదే స్ఫూర్తితో ఉన్నత విజయాలు సాధిస్తా.

గొప్ప అనుభూతి.. డాక్టర్ జమున, పీహెచ్‌డీ స్కాలర్



నేను జగిత్యాల ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలుగా పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకోవడం ఆనందంగా ఉంది. ఇది నాకు గొప్ప అనుభూతి. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.. డాక్టర్ ఫాతిమా సుల్తానా, పీహెచ్‌డీ స్కాలర్



నేను మానకొండూరు మండలం పోచంపల్లి మోడల్ స్కూల్లో పని చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ సంతోషం మాటల్లో చెప్పలేనిది.

యూనివర్సిటీకి కృతజ్ఞతలు డాక్టర్ ఎన్ మాల్లారెడ్డి, పీహెచ్‌డీ స్కాలర్



పీహెచ్‌డీ పట్టాను గవర్నర్ చేతుల మీదుగా తీసుకోవడం ఆనందంగా ఉంది. 2023లో కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేసినందుకు నాకు ఈ రోజు పట్టా ఇచ్చారు. శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు.

తోటి గిరిజన తెగపై పరిశోధన చేశా.. డాక్టర్ మరక శ్రీనివాస్, పీహెచ్‌డీ స్కాలర్



గిరిజన తెగల్లో అతి తక్కువ జనాభా ఉన్న తోటి గిరిజన తెగపైన పరిశోధన చేశా.. గవర్నర్ చేతుల మీదుగా పట్టా తీసుకోవడం ఆనందంగా ఉంది. ఈ పరిశోధనకు సహకరించిన గురువు వన్నాల రమేష్‌కు, కుటుంబ సభ్యులందరికి కృతజ్ఞతలు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి ఆటల పోటీలు



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో 11వ జోనల్‌స్థాయి ఆటల పోటీలలో భాగంగా శుక్రవారం రెండోరోజు పోటీలు కొనసాగాయి. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, క్యారమ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో అండర్ 14 విభాగంలో క్యారమ్ డబుల్స్‌లో మానకొండూర్ ప్రథమ, దుబ్బాక ద్వితీయ, చెస్‌లో దుబ్బాక ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-17 విభాగంలో కబడ్డీలో కోహెడ ప్రథమ, చేర్యాల ద్వితీయ, క్యారమ్ డబుల్స్‌లో హుస్నాబాద్ ప్రథమ, ముస్తాబాద్ ద్వితీయ, చెస్‌లో ముస్తాబాద్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయస్థానాలు సాధించాయి. అండర్-19విభాగంలో ఖోఖోలో మానకొండూర్ ప్రథమ, కోహెడ ద్వితీయ, బాల్ బ్యాడ్మింటన్‌లో మానకొండూర్ ప్రథమ, రుక్మాపూర్ ద్వితీయ, చెస్‌లో కోహెడ ప్రథమ, అల్వాల్ ద్వితీయ స్థానాలు సాధించాయి.

వైభవంగా గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న వేదపండితులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని ధర్మపురి క్షేత్రంలో గోదావరి హారతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, హరినామ సంకీర్తనలతో గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. రాత్రివేళలో మహిళలు దొప్పల్లో దీపాలు వెలిగించి గోదావరినదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సుధగోని లహరి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. శుక్రవారం సిరిసిల్ల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో లహరిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడకల సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాటాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లహరి చదువుతో పాటు ఆటల్లో రాణిస్తోందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 10 వరకు ఖమ్మం జిల్లా పినపాక మండలం బయ్యారంలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు నుంచి లహరి పాల్గొంటుందని తెలిపారు.



లహరికి మెమొంటోను అందిస్తున్న హెచ్‌ఎం శారద

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి వంకాయల నందన్‌సాయి ఎంపికయాడు. విద్యార్థి వంకాయల నందన్ సాయిని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, ఆర్చరీ కోచ్ మహేందర్, హరీష్, భారతి విద్యాలయం పాఠశాల కరస్పాండెంట్ రామ్‌రెడ్డి, ప్రిన్సిపల్ కృష్ణాకర్ శుక్రవారం అభినందించారు.

తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రం కొత్తపల్లి లోని అల్ఫోర్స్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ జూనియర్స్, సబ్ జూనియర్స్ పోటీలు నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వంకాయల నందన్‌సాయి ఇండియన్ రౌండ్‌లో ప్రథమస్థానంలో నిలిచి ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9న రంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో జరిగే పోటీల్లో నందన్‌సాయి ఉమ్మడి జిల్లా నుంచి పాల్గొననున్నారు.



నందన్ సాయి

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం శుక్రవారం తగ్గింది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం రెండు గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. మోయతుమ్మెద వాగునుంచి 3,282 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తుండగా, రెండు గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్‌భగీరథ, ఆవిరిరూపంలో 254 క్యూసెక్కులు మొత్తం 4,254 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతోంది.

అట్టహాసంగా జాతీయస్థాయి కరాటే పోటీలు ప్రారంభం

- హాజరైన సినీ హీరో సుమన్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ హీరో, కరాటే లెజెండ్ డాక్టర్ సుమన్ తల్వార్ ప్రారంభించారు. కాంటినెంటల్ షోటోకాన్ కరాటే డో ఇండియా నేషనల్ అకాడమీ చీఫ్ ఇ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో దేశవ్యాప్తంగా 1200 మంది క్రీడాకారులు పోటీ పడనున్నారు. ఈ సందర్భంగా హీరో సుమన్ మాట్లాడుతూ కరాటే ప్రపంచంలోనే నంబరువన్ క్రీడగా అవతరించిందని, ఎక్కువ దేశాల్లో కరాటేకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. కరాటే నేర్చుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతన్నారు.

ఈరోజుల్లో అమ్మాయిల మీద జరుగుతున్న సంఘటనలు తనను చాలా బాధించాయని, కరాటే నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. మలేషియా గ్రాండ్ మాస్టర్ అనంతన్, టోర్నమెంట్ చీఫ్ అడ్వయిజర్ రవీందర్ కుమార్, వసంత్ కమార్, సురభి వేణుగోపాల్, గౌరు రాజిరెడ్డి, ఐలయ్య, మొండయ్య, మన్నన్, ఆర్గనైజర్ మాడుగుల ప్రవీణ్, ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ హీరో సుమన్, పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఐదు దశాబ్దాలుగా ఎన్టీపీసీ వెలుగులు

- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత - ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

జ్యోతినగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాలుగా దేశానికి వెలుగులను అందిస్తూ ప్రపంచ అగ్రగామి సంస్థగా ఎన్టీపీసీ వెలుగొందుతోందని రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చందన్‌కుమార్ సామంత అన్నారు. ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రసంగించారు. దేశాభివృద్ధికి ఎన్టీపీసీ చేయూతనందిస్తోందన్నారు. పారిశ్రామిక, గృహ అవసరాలకు విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. దేశంలో నాలుగో వంతు విద్యుత్‌ను ఎన్టీపీసీ సంస్థ నిరంతరాయంగా అందిస్తోందన్నారు. ఎన్టీపీసీ సిబ్బంది కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. భవిష్యత్‌లో ఇదే స్ఫూర్తితో ఉద్యోగులు పనిచేయాలని ఆయన కోరారు. విద్యుత్పత్తితోపాటు సామాజిక అభివృద్ధికి ఎన్టీపీసీ కృషి చేస్తోందన్నారు. ఎన్టీపీసీ కాకతీయ ఆడిటోరియం, ఈడీ రెసిడెన్షియల్ ఏరియాలో మాస్ ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చందన్‌కుమార్ ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించారు. అలాగే ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈడీ కేక్ కట్ చేశారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఆయా విభాగాల జీఎంలు, అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఈడీ చందన్ కుమార్, అధికారులు

సామూహిక వందేమాతరం గీతాలాపన


కోరుట్లలో వందేమాతరం ఆకృతిలో విద్యార్థులు


రాయికల్‌లో గీతాలాపన చేస్తున్న విద్యార్థులు


భీమారంలో గీతాలాపనలో పాల్గొన్న విద్యార్థులు

కోరుట్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందేమాతరం 150 సంవత్సరాల ఆకృతిలో విద్యార్థులు ఏర్పడి గీతంను ఆలపించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రదానోపాధ్యాయుడు గోపు వేంకటేష్ ఆద్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందేమాతర గీతం రచించిన బంకిం చంద్రచటర్జీని స్మరిస్తూ ఆయ రచించిన స్పూర్తి వివరించారు. వందేమతర గీతం స్వాతంత్ర స్పూర్తిని నింపిందని అన్నారు. అదే విధంగా పలు పాఠశాలతో పాటు వందేమాతర గీతంను అలపించి వేడుకలను నిర్వహించారు. అదే విధంగా ఆర్‌టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఆద్వర్యంలో డిపో వందేమాతర వేడుకలను నిర్వహించారు.

●**ధర్మపురి:** ధర్మపురి మండల కేంద్రంలో పలు చోట్ల శుక్రవారం వందేమాతరం గీతాలాపన చేసి జాతీయ జెండాను వందనం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ధర్మపురి జాతీయవాది సంఘం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా స్థానిక నంది చౌక్ వద్ద వందేమాతరం గీతాలాపన చేశారు. ధర్మపురి మండల ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద వందేమాతరం గీతాలాపన చేశారు. లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వందేమాతరం గీతాలాపన చేశారు. చైతన్య భారతి విద్యానికేతన్, ఆంగ్లోవేదిక్ కాన్వెంట్, కేరళ ఇంగ్లీష్ మీడియం, ఏసీఈ హైస్కూల్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపనన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామెర రాంసుధాకర్‌రావు, పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షులు చందోళి శ్రీనివాస్, స్కూల్ కరస్పాండెంట్స్ సంగన భట్ల రామకిష్టయ్య, సంగనభట్ల దినేష్, చిలువేని శ్యాంసుందర్, గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ తోట శంకర్, సంగనభట్ల సంతోషి, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ తిరుపతి పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** దేశభక్తికి శాశ్వత చిహ్నంగా జాతీయ గుర్తింపు పొందిన గీతం వందేమాతరం తరతరాలకు స్ఫూర్తిదాయకమని మెట్‌పల్లి మండల విద్యాధికారి చంద్రశేఖర్, మండల ప్రజా అభివృద్ధికారి సురేష్‌లు అన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయలతో పాటు గ్రామాల్లోని పంచాయతీ, పాఠశాలలో సామూహిక వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**రాయికల్:** వందేమాతరం 150 ఏళ్ల సంబరాల్లో భాగంగా శుక్రవారం రాయికల్ ప్రభుత్వ పాఠశాలలో వందేమాతరం గీతాలాపన చేశారు. అనంతరం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీమలదారి సదాశివ్ మాట్లాడుతూ వందేమాతరం నినాదం భారత స్వాతంత్ర్య సమరానికి ప్రాణం పోసిందని, ఈ పదజాలం భారతీయుల హృదయాల్లో దేశభక్తి జ్యోతి రగిలించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర శాఖ సహాధ్యక్షుడు వేల్పుల స్వామి యాదవ్, ఎద్దండి రమేష్, హన్మంత రావు, జియావుద్దీన్, శ్రీలత, నీరజ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలో బీజేపీ నాయకులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శులు కునారపు భూమేష్, బన్న సంజీవ్, ఉపాధ్యక్షుడు ఎల్లాగౌడ్, అల్లె నర్సయ్య, నాయకులు కల్లెడ ధర్మపురి, సామల్ల సతీష్, బొడుగం శ్రీకాంత్, దాసరి రవి, అందె శంకర్, బూర్ల గోపి, శ్రీగద్దె సుమన్, మచ్చ శంకర్, మచ్చ గంగరాజం తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**భీమారం:** మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌లో వందేమాతరం గేయాలాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పల్లికొండ గణేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువులోనే కాదు తన దేశం కోసం కూడా ఆలోచించాలన్నారు.

●**కథలాపూర్:** వందేమాతరం గీతం స్వాతంత్ర్యోద్యమంలో ఉద్యమ ఆకాంక్షకు స్ఫూర్తినిచ్చిందని ఎంపీడీవో శంకర్‌నాయక్, యువజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామ పంచాయతీ ఆవరణ, పాఠశాలల్లో వందేమాతరం 150వ ఉత్సవాలు జరుపుకుని గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాలల హెచ్‌ఎంలు, సామాజిక కార్యకర్తలు గాంధారి శ్రీనివాస్, మల్యాల మారుతి, చిట్యాల మహేశ్, కాశోజి ప్రశాంత్, ఎలేటి రాజేంధర్ తదితరులు ఉన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** మండలంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో తహసీల్దార్ వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేష్, సిబ్బంది వందేమాతర గేయాన్ని ఆలపించారు.

●**కొడిమ్యాల:** మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.వేణు, ఎంఈవో శ్రీనివాస్, ఏవో పి.జ్యోతి, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

●**ఎండపల్లి:** మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలతో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, సామాజిక కార్యకర్తలు వందేమాతర గేయాలాపన చేశారు. గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో వందేమాతరం గీతాలాపనలో ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి పాల్గొన్నారు.

●**మల్యాల:** మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక వందేమాతరం గీతాలాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

●**గొల్లపల్లి:** మండల కేంద్రంలో వివిధ రాజకీయ, ప్రజా, కుల సంఘాల నాయకులు. విద్యా సంస్థల్లో సామూహిక జాతీయ గీతాలాపన నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ మండల శాఖ అధ్యక్షులు కుంభార్‌కార్ అరుణ్, భజరంగ్ దళ్ మండల శాఖ అధ్యక్షులు ఎనగందుల రమేష్ సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక జాతీయ గీతాలాపన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ సీనీయర్ నాయకులు కట్ట మహేష్, లీడ్ ఇండియా ఆర్గనైజర్ తాడూరి శ్రీనివాస్, వీహెచ్‌పీ పట్టణ శాఖ అధ్యక్షులు అంకం సతీష్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి రవి, టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గంగాధర నరేష్, స్థానిక నాయకులు చౌటపెల్లి తిరుపతి, అంకం లింబాద్రి పాత సంతోష్, అందే అజయ్, గోపు రాకేష్ పాల్గొన్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు ఆయా పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా వందేమాతరం గీతం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** ప్రతి భారతీయుడు వందేమాతర గేయం యొక్క చరిత్రను తెలుసుకోవాలని తహసీల్దార్ వహిదోద్దిన్ అన్నారు. వందేమాతర గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని ఆయా కార్యాలయాల్లో వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వహిదోద్దిన్, ఎంపీడీవో చౌడారపు గంగాధర్, నాయకులు గుర్రాల రాజేందర్‌రెడ్డి, కోంద్ర రాంచందర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.


ధర్మపురిలో వందేమాతరం గీతాలాపన


మల్యాలలో గీతాలాపన చేస్తున్న విద్యార్థులు


కొడిమ్యాలలో గీతాలాపన చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

'పత్తి కొనుగోలులో పరిమితిని ఎత్తివేయాలి'

కొడిమ్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలులో 7 క్వింటాళ్ల పరిమితిని ఎత్తి వేయాలని వ్యవసాయ యూనివర్సిటీ సలహా మండలి మాజీ సభ్యుడు, పూడూర్ మాజీ సర్పంచు వెల్ముల రాంరెడ్డి కోరారు. మాజీ సర్పంచ్ శుక్రవారం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తేమ 12శాతం రంగు మారని, నాణ్యత గల పత్తిని క్వింటాలుకు 8110 రూపాయలను నిర్ణయించిందన్నారు. భారత పత్తి కార్పొరేషన్ అధికారులు మాత్రం ప్రభుత్వం తెలిపిన ప్రమాణాలతో కూడిన పత్తిని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించిన తర్వాత ఎకరానికి కేవలం 7 క్వింటాళ్ళ పత్తిని మాత్రమే మద్దతు ధరకు కొంటామని మిగతా పత్తిని ఎక్కడైనా అమ్ముకోవచ్చునని చెబుతున్నారన్నారు. గత సంవత్సరం ఎకరానికి 12 క్వింటాళ్ళ పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసారన్నారు. పత్తి వేసిన పంట వివరాలతో ఎన్ని ఎకరాలలో పత్తిని సాగు చేసాడన్న రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్నాయన్నారు. పతి ఎకరానికి 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పటం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులతో పత్తి పంట వివరాలను సర్వే చేయించి సంబందిత సర్టిఫికెట్‌ను అధికారులు జారీ చేయాలన్నారు. మొత్తం పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణాలకు భూమి పూజ

రాయికల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ఒడ్డెలింగాపూర్ ఆలయంలో శుక్రవారం హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పండితుడు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో యాచమనేని మునీందర్‌రావు, మాజీ సర్పంచ్ రవిగౌడ్ పాల్గొన్నారు.

●గొల్లపల్లి: గొల్లపల్లిలో నిర్మించనున్న అష్టభుజ దుర్గా ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, పండితులు శ్రీపెల్లి బ్రాహ్మచారి, రేవేళ్ల తిరుపతి చారి, ఎదులాపురం భాస్కరాచారి, కట్ట సురేష్ చారి, అరవిందచారి పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


ధాన్యం తూకం చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్య

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి ఏఎంసీ చైర్‌పర్సన్ చిలుముల లావణ్య కోరారు. ధర్మపురి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, మండల తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, సూపర్‌వైజర్ వెంకటనర్సయ్య, పాలకవర్గ సభ్యులు గందం రాజయ్య, గునిశెట్టి అంజయ్య, ఏఈవో నవ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కొడిమ్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు ముగిసాయి. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ క్రీడల వల్ల క్రీడాకారులకు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని కోరారు. మండల స్థాయిలో విజయం సాధించిన విజేతలను అభినందించారు. అండర్ 17బాలుర 3 కిలో మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించిన జశ్వంత్‌కు గోల్డ్ మెడల్‌ను అందించారు. అనంతరం ఎస్.జీ.ఎఫ్ కార్యదర్శి పీడీ బూట్ల రాజమల్లయ్య మాట్లాడుతూ విజయం సాధించిన క్రీడాకారులు ఈ నెల 8న జగిత్యాల పట్టణంలోని స్వామి వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం హమీదుల్లాఖాన్, ప్రధానోపాధ్యాయురాలు పద్మారాణి, పీడీలు బీరయ్య, శివకృష్ణ, గంగాజల, హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన బి.మనీషా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-17 విభాగం పోటీలలో ప్రతిభ కనబరచడంతో నేటి నుంచి మూడు రోజుల పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాకలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనన్నున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మనీషాను పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కొడిమ్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యువతకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ యువతె దేశ భవిష్యత్తు అని ర్యాగింగ్‌కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. విద్య కేవలం ఉద్యోగం పొందటానికి మాత్రమె కాదని, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించడానికి ఉపయోగపడు ఆధ్యాత్మిక శక్తి అన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటుగా మానవీయ విలువలను కాపాడాలన్నారు. సోషల్ మీడియాలో సమయాన్ని వృదా చేయకుండా సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీనియర్లు, జూనియర్లు అనె తేడా లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో విద్యను కొనసాగించుతూ ఉం ఎలాంటి ర్యాగింగ్‌లాంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. .కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు విద్యార్థుల నడవడికపై ప్రవర్తనపట్ల శ్రద్ద వహించాలన్నారు. అంతక ముందు కళాశా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. నరసింహ మాట్లాడుతూ సాంకేతిక విద్య ప్రయోజనాలను, స్టూడెంట్స్ క్లబ్, ఐడియా ల్యాబ్స్ గురించి వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు క్లబ్, ల్యాబ్‌ల వలన కలుగు ప్రయోజనాలను క్లుప్తంగా వివరించారు. కళాశాలలో ఉన్న వసతులు, సౌకర్యాలు ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, వివిద విభాగాల అధిపతులు డాక్టర్. సురేష్ శ్రీపాద, డాక్టర్ సీహెచ్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ బి. సతీష్‌కుమార్, డాక్టర్ ఎస్. సురేష్‌కుమార్, డాక్టర్ ఎం.ఎస్. రాజశేఖర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

మల్యాల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏఎన్‌సీ క్లినిక్ డే సందర్భంగా మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు వైద్యురాలు మౌనిఖ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలతో పాటు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి, రమనమ్మ పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కార్యదర్శిగా రాజు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ధర్మపురి పట్టణ కార్యదర్శిగా కలకోట రాజును నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు యాదగిరిబాబు ఆదేశాల మేరకు పట్టణ బీజేపీ అధ్యక్షులు గాజు భాస్కర్ శుక్రవారం రాజుకు నియామకపు లేఖను అందించారు. బీజేపీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరుతూ ఆ లేఖలో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు


ధాన్యం తేమను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లత

మల్యాల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పోతారం, రామన్నపేట, రాజారం గ్రామాల లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, టార్పలిన్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అలాగే మద్దతు ధరలు, టోల్‌ఫ్రీ నంబర్ వివరాలు స్పష్టంగా కనిపిం చేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు వారి బ్యాంకు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు కొనుగోళ్ల సందర్భంగా ఏమైన ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1800 4258 187లో సంప్రదించాలని చెప్పారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్, పలువురు రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్యం

(ఐదో పేజీ తరువాయి)

ఆహారంలో ఐరన్ వరుసగా 13 మిల్లీగ్రాముల నుంచి 15, 19 మిల్లీగ్రాములు ఉంటుందని అంటున్నారు.

● పోషకాలు ఎంతమేర కలుపుతారంటే..

ఒక బ్యాగుకు 28 నుంచి 42.5 మిల్లీగ్రాముల వరకు ఐరన్ (ఫెర్రిక్ పైరోఫాస్ఫేట్) కలుపుతారు. దీనికి బదులు సోడియం ఐరన్ 14 నుంచి 25.25 మిల్లి గ్రాములు కలుపుతారు. ఒక బ్యాగుకు 75 నుంచి 125 మిల్లీగ్రాముల వరకు ఫోలిక్ యాసిడ్, విటమిన్ బీ-12 కోసం హైడ్రాక్సికో బలమైన పోషకాలు, జింక్, విటమిన్ ఏ, థయమిన్, రైబోఫ్లావిన్, నియాసిన్, విటమిన్ బీ6, పోషకాలు కలుపుతారు. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా మహిళల్లో రక్తహీనత సమస్య ఉండదు. చిన్న పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందుకోసమే బియ్యాన్ని హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకాల్లో వినియోగిస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు

ఇబ్రహీంపట్నం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ నంబర్ టీఎస్02యూసీ2799 కథలాపూర్ నుండి ఆర్మూర్ వైపు తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకుని తనిఖీలు నిర్వహించారు. మెట్‌పల్లి ఆర్ఐ ఎర్ర కాంతయ్య ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు డ్రైవర్ షేక్ జాబు, లారీ యజమాని నయీముద్దీన్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనానికి డీఎస్పీకి ఆహ్వానం

జగిత్యాల అర్బన్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో ఈనెల 16వ తేదీన నిర్వహించబోయే స్వర స్నేహం ఆత్మీయ సమ్మేళనానికి జగిత్యాల డీఎస్పీ దురిశెట్టి రఘుచందర్‌ను ఆహ్వానించారు. సంగీత, సాహిత, సామాజిక సేవా నేపథ్యంలో ఏర్పాటు చేసిన స్వర స్నేహం సంస్థ ఆధ్వర్యంలో పలు సంస్కృతిక కార్యక్రమాల నిర్వహన చేపడుతున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు గోపాల్ ఆచార్య తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర స్నేహం జిల్లా అధ్యక్షురాలు జి. రచన, గౌరవాధ్యక్షులు శ్రీలత, సంయుక్త కార్యదర్శి శ్రీలత, మరియు బోనగిరి లక్ష్మీ ఉన్నారు.

రామకృష్ణ కళాశాల విద్యార్థినికి బంగారు పతకం


గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకుంటున్న సంగీత

జగిత్యాల అగ్రికల్చర్, నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం కరీంనగర్ లో జరిగిన శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో జగిత్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పిజీ విద్యార్థిని జే.సంగీత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాన్ని స్వీకరించారు. ఎంఏ తెలుగులో అత్యధిక మార్కులు సాధించినందుకు గాను ఈ బంగారు పతకాన్ని అందుకున్న సంగీతను శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ యు. ఉమేష్, రామకృష్ణ విద్యాసంస్థల కరస్పాండెంట్ యాద రామకృష్ణ సంగీతను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పల్లెర్ల నరేష్, కొక్కుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

-ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌రావు

పెగడపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నర్సరీలలో మొక్కల పెంపకం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని పెగడపల్లి ఎంపీడీవో ఇనుగంటి ప్రేమ్‌సాగర్ రావు పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాజారాంపల్లి గ్రామాలలో నర్సరీలను, పల్లె ప్రకృతి వనాలను , ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ రావు సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే తూకం వేయాలని సూచించారు. ఎంపీడీవో వెంట ఎంపీఓ శశి కుమార్ రెడ్డి, ఏపీవో అనీల్ కుమార్, టీఏ నాని, పంచాయతీ కార్యదర్శులు నరేందర్, శ్రీనివాస్, క్షేత్ర సహాయకులు మల్లేశం, లక్ష్మి, తదితరులు ఉన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనకే వయోజన విద్య


మాట్లాడుతున్న మహిళాసంఘం నాయకులు

మెట్‌పల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ ప్రపంచంలో విద్యకున్న ప్రాముఖ్యతను వయోజన విద్య కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరక్షరా స్యులైన పెద్దలకు వివరిస్తూ అక్షరాస్యులుగా మార్చేందుకు కృషి చేయాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వయోజన విద్యపై వివోఏబీ, వివోఏ, సెర్ఫ్ ఆర్పీలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యా ప్రాధాన్యం, వయోజన విద్య వల్ల కలిగే ప్రయోజనాలు, నిరక్షరాస్యతతో కలిగే సమస్యలు, మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పట్టణం, గ్రామాల్లో చదువుకోని గుర్తించి నిరక్షరాస్యతతో ఆర్థిక ఇబ్బందులు, అక్షరాస్యతపై అవగాహన లేకపోవడంతో సమాజంపై అవగాహన లోపం, ప్రభుత్వ పథకాలు గురించి తెలియక ఇబ్బందులు, చట్టపరమైన సమస్యల పరిష్కరం వంటిపై అవగాహన లేక ఇబ్బందులు పడుతారని తెలుపుతూ నిరక్షరాస్యతను తగ్గించాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీవో అశోక్, సీసీలు వెంకటరమణ, అశోక్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీలు

కథలాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఐ నవీన్‌కుమార్ ఆద్వర్యంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నార్కోటిక్ జాగిలాలతో తనిఖీలను నిర్వహించారు. గంజాయి లాంటి మత్తు పదర్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ నవీన్ సహకారంతో మండల కేంద్రంలోని వివిధ దుకాణ సముదాయాలు, బస్టాండ్ ప్రాంతాలలో జాగిలంతో ట్రాస్ పోర్స్ పోలీసులు తనిఖీలను నిర్వహించారు. గంజాయి రవాణ చేసిన సేవించిన కఠిన చర్యలు తీసుకోబడునని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

-టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్

కోరుట్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుసిన వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జు మానుక ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అయిలాపూర్, చిన్నమెట్‌పల్లి, ఎఖీన్‌పూర్, ధర్మారం గ్రామాలలోని వరి, మొక్కజొన్న దాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు వ్యవసాయ క్షేత్రాలలో నెలకొరిగిన పంటను పరిశీలించారు.

ఈ సందర్భంగా మానుక ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. తడిచిన ధాన్యంను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశ్నారు. ఈ కార్యక్రమంలో మహదేవ్, శ్రీనివాస్, బాలే మారుతి, విజయ్‌కుమార్, సిద్దు, విష్ణు, పిరోజ్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.